

టీబీ డ్యామ్‌కు ఇన్‌ఫ్లో

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి 1,093 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. టీబీ డ్యాంలో ప్రస్తుతం 4 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ఔట్‌ఫ్లో 251 క్యూసెక్కులు ఉంది.



అహోబిలేశుడికి విశేష పూజలు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలం ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



శ్రీశైలం చేరుకున్న స్పీకర్

శ్రీశైలంటెంపుల్: శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా శనివారం శ్రీశైలం చేరుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

కర్నూలు సిటీ: పాలిసెట్–2023 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ నెల 10వ తేదీన కర్నూలులో 13 కేంద్రాలు, ఆదోనిలో 7 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. కర్నూలులో 3,954 మంది, ఆదోనిలో 2,620 మంది పరీక్ష రాశారు. శనివారం విడుదలైన ఫలితాల్లో జిల్లాకు చెందిన పోలూరి కీర్తి ప్రియాంక రాష్ట్ర స్థాయిలో 168వ ర్యాంకు(జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంకు), కురుబ దీక్షిత 457వ ర్యాంకు(జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు), ఎం.క్రిష్ణకీర్తన రాష్ట్ర స్థాయిలో 653వ ర్యాంకు(జిల్లా స్థాయిలో థర్డ్ ర్యాంకు) సాధించారు.

అదుపులోకి రాని ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉష్ణోగ్రతలు అదుపులోకి రావడం లేదు. శనివారం అత్యధికంగా కర్నూలు జిల్లాలో 44.76 డిగ్రీలు, నంద్యాల జిల్లాలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. దాదాపు 10 రోజులుగా ఆకాశం నుంచి నిప్పుల వర్షం కరుస్తున్నట్లుగా ఎండల తీవ్రత ఉండటం గమనార్హం. పగటి ఉష్ణోగ్రతలకు సమానంగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కర్నూలులో రాత్రి ఉష్ణోగ్రత 30.7 డిగ్రీలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఎండలు, వడగాలుల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. రాష్ట్రంలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

చెరువులకు అమృత్ యోగం

- ప్రతి పొలానికి నీరు ఇచ్చే విధంగా పనులు
- మొత్తం 75 చెరువుల్లో 65 పూర్తి
- వాటర్‌షెడ్ నిధులతో నాలుగు కొత్త చెరువుల నిర్మాణం
- అభివృద్ధి పనుల పరిశీలనకు మూడు ప్రత్యేక బృందాలు



ఆస్పరి మండలం కారుమంచి చెరువును అమృత్ సరోవర్‌గా అభివృద్ధి చేసిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): చెరువులను అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేసే పనులు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. హర్ కేత్ కో పానీ(ప్రతి పొలానికి నీరు) నినాదంతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గతేడాది దేశ వ్యాప్తంగా ఆజాద్ కీ అమృత్ మహోత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చెరువులను అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేసేందుకు ఆదేశాలు ఇచ్చింది. కర్నూలు జిల్లాలో 2023 ఆగస్టు నాటికి 75 చెరువులను అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. ఇందుకు అనుగుణంగా జిల్లా నీటియాజమాన్య సంస్థ చెరువులను ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ నుంచి పరిపాలనా ఆమోదం తీసుకొని గతేడాది నుంచే పనులు చేపట్టింది. గతేడాది పంద్రాగస్టు నాటికి 15 చెరువులను అభివృద్ధి చేసి స్వాతంత్ర్య దినోత్సవం రోజున వాటి కట్టలపై జాతీయ పతాకాలను ఎగుర వేశారు. మొత్తం 75 చెరువులకు సంబంధించిన పనులు పూర్తి చేసి ఈ ఏడాది ఆగస్టు 15న జాతీయ పతాకం ఆవిష్కరించనున్నారు.

నీటిపారుదల శాఖ భాగస్వామ్యం

తుగ్గలి మండలంలో 12, ఆస్పరి మండలంలో 7, ఓర్వకల్, పత్తికొండ మండలాల్లో 6 , వెల్దుర్తి మండలంలో 5, ఆలూరు, చిప్పగిరి మండలాల్లో 4, ఆదోని, గోనెగండ్ల, హొళగుంద, ఎమ్మిగనూరు, కర్నూలు, దేవనకొండ, హాలహర్వి, మద్దికెర మండలాల్లో 3 ప్రకారం , కల్లూరు, కృష్ణగిరి మండలాల్లో రెండేసి, కోసిగి, నందవరం, కోడుమూరు మండలాల్లో ఒక్కొక్క చెరువును అమృత్ సరోవర్‌లుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటి వరకు 65 చెరువుల్లో పనులు పూర్తయ్యాయి. మరో 10 చెరువుల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అమృత్ సరోవర్‌ల అభివృద్ధిలో నీటిపారుదల శాఖ కూడా భాగస్వామ్యం అవుతోంది. ఇప్పటి వరకు ఉపాధి నిధులు రూ.3 కోట్లు ఖర్చు చేశారు. పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, చెరువు కట్టలను బలోపేతం చేయడం, కొండ, కోనలు, అడవుల నుంచి చెరువుల్లోకి నీళ్లు వచ్చే కాల్వలను అభివృద్ధి చేయడం, చెరువు నుంచి బయటికి నీరు వెళ్లే కాల్వల్లో అడ్డంకులు తొలగించడం వంటి పనులు చేశారు.చెరువు కట్టపై పతాకావిష్కరణకు అవసరమైన దిమ్మెలు నిర్మించారు. చెరువు కట్టను పరిశుభ్రం చేయడం వంటి పనులు నిర్వహిస్తున్నారు.

పెరగనున్న భూగర్భ జలాలు

హర్ కేత్ కో పానీ(ప్రతి పొలానికి నీరు) నినాదంతో అమృత్ సరోవర్ పనులు నిర్వహిస్తున్నారు. చెరువుల్లో పూడిక తీయడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగింది. దీంతో వీటి కింద ఉన్న బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. అమృత్ సరోవర్ చెరువుల్లో ఇప్పుడున్న నీటి సామర్థ్యానికి అదనంగా 10 వేల క్యూబిక్ మీటర్ల నీరు(కోటి లీటర్లు) నిల్వ ఉండాలనేది ప్రధాన లక్ష్యం. ఇందుకు అనుగుణంగా రెండున్నర లోతు అడుగుల మేర పూడిక తీస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూడిక తీసిన చెరువుల్లోకి నీరు చేరి కళకళలాడుతోంది. చెరువు కట్టలపై మర్రి, వేప, రావి మొక్కలు నాటనున్నారు. వాతావరణ సమతుల్యానికి ఈ మొక్కలు దోహదపడుతాయి. చెరువు కట్టలపై స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో సిమెంట్ బెంచీలు కూడా ఏర్పాటు చేస్తారు.

నాలుగు కొత్త చెరువుల నిర్మాణం

అమృత్ సరోవర్‌ల కింద జిల్లాలో నాలుగు కొత్త చెరువులను తీర్చిదిద్దుతున్నారు. పీఎంకేఎస్‌వై 2.0 వాటర్‌షెడ్ నిధులను ఇందుకు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే 85 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. ఓర్వకల్లు మండలం కాల్వ, కృష్ణగిరి మండలం పోతుగల్, ఎమ్మిగనూరు మండలం కందనాతి, హాలహర్వి మండలం బాపురం గ్రామాల్లో కొత్త చెరువులను అభివృద్ధి చేస్తున్నారు. ఒక్కో చెరువు నిర్మాణానికి రూ.9 లక్షలు ఖర్చు చేస్తున్నారు. 10 వేల క్యూబిక్‌మీటర్ల నీటి సామర్థ్యం ఉండే విధంగా వీటిని నిర్మిస్తున్నారు. ఒక్కో చెరువుకు క్యాచ్‌మెంటు ఏరియా 250 ఎకరాలుగా గుర్తించారు. 250 ఎకరాల్లోని అడవులు, కొండ,కోనల నుంచి వర్షపు నీరు కొత్త చెరువులకు చేరనుంది.



ఎమ్మిగనూరు మండలం కందనాతిలో నిర్మిస్తున్న నూతన అమృత్ సరోవర్ చెరువు

మూడు ప్రత్యేక బృందాలు

అమృత్ సరోవర్ చెరువులను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ సృజన మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. భూగర్భ జల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఉద్యానశాఖ, వ్యవసాయ శాఖల అధికారులు, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలతో ఈ బృందాలు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో బృందం 25 చెరువులను పరిశీలిస్తుంది. జూన్ మొదటి వారం నాటికి జిల్లా స్థాయి బృందాల పరిశీలన పూర్తవుతుంది. అనంతరం కేంద్ర, రాష్ట్ర బృందాలు కూడా అమృత్ సరోవర్ చెరువులను సందర్శిస్తాయి.

ఆగస్టు నాటికి పూర్తి చేస్తాం



వచ్చే ఆగస్టు నాటికి 75 చెరువులను అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే 65 చెరువుల పనులు పూర్తయ్యాయి. కొత్తగా వాటర్‌షెడ్ నిధులతో నాలుగు చెరువులను తయారు చేస్తున్నాం. చెరువులు అభివృద్ధి చెందితే తాగు నీటి సమస్యలు తీరుతాయి. భూగర్భ జలాలు పెరుగుతాయి.

– అమరనాథరెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

సెప్టెంబర్ నెలాఖరుకు ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి

- పీఆర్ ఎస్‌ఈ కే సుబ్రమణ్యం



కర్నూలు(అర్బన్): జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ భవన (గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్) నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు పీఆర్ ఎస్‌ఈ కే సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలాఖరు నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. జిల్లాలో రైతు భరోసా కేంద్రాలు 188, గ్రామ సచివాలయాలు 247, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ 179 భవన నిర్మాణాలు (మొత్తం 614) పూర్తి కావొచ్చే దశలో ఉన్నాయన్నారు. ముందుగా వీటిని పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయి ఇంజినీర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

సబ్సిడీ విత్తనాలకు డి-క్రిషి యాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● నేటి నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలు, పచ్చి రొట్ట ఎరువులు పొందడానికి డీ-క్రిషి యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి రైతులకు సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేటి నుంచి మొదలవుతుందని, 25వ తేదీ నుంచి సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయాలనే లక్ష్యంగా ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు వేరుశనగ కే-6 రకం 15,905 క్వింటాళ్లు కేటాయించిందని.. ఇప్పటికే ఆర్‌బీకేల్లో ఏపీ సీడ్స్ 2వేల క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉంచిందన్నారు. రైతులు నాన్ సబ్సిడీ చెల్లించిన వెంటనే వేరుశనగ ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు. వేరుశనగ కిలో పూర్తి ధర రూ.93లుగా నిర్ణయించగా.. ఇందులో సబ్సిడీ 40 శాతం ఉంటుందన్నారు. ఈ మేరకు రైతులు కిలో వేరుశనగకు రూ.55.80 ప్రకారం చెల్లించాలన్నారు. పచ్చి రొట్ట ఎరువులైన దయంచ, పిల్లి పెసర విత్తనాల ధరలు కూడా ఖరారయ్యాయి. వీటిని కూడా 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పండ్ల తోటల అభివృద్ధిపై దృష్టి

ఎమ్మిగనూరురూరల్: పండ్ల తోటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధి హామీ పథకం సిబ్బందికి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, వాటర్ షెడ్ వర్క్స్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం బనవాసిఫాంలో సెంట్రల్ నర్సరీని తనిఖీ చేశారు.

పకడ్బందీగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

● జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

కర్నూలు(సెంట్రల్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమన్వయ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 25,559మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 16,865 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 8694 మంది ఉన్నట్లు వివరించారు. వీరి కోసం 53 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించవద్దని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని ఆదేశించారు. పత్తికొండ, మంత్రాలయం, నాగలదిన్నె, చిప్పగిరి, తుగ్గలి తదితర ప్రాంతాలకు పరీక్షల సమయానికి అనుగుణంగా బస్సులను నడపాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగేశ్వరరావు, ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, అడిషినల్ డీఎంహెచ్ఓ భాస్కర్, డీవీఈఓ జమీర్‌బాషా, డీఈసీ సభ్యులు కె.నాగభూషణ్‌రెడ్డి, జి.లాలెప్ప, ప్రభు, గోవిందరాజులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, హాజరైన అధికారులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యశ్రీ పథకం రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని న్యూ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో, ఆరోగ్యమిత్రలతో కలెక్టర్ సమావేశమయ్యారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు, ఆరోగ్యమిత్రలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 2,300 మంది క్షయ రోగులు ఉన్నారని, వారికి ఆరు నెలల పాటు పోషకాహారం కిట్లు అందించాలన్నారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, డీసీమెచ్ఎస్ డాక్టర్ రాంజీనాయక్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు

కర్నూలు సిటీ: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎస్.వి.ఎస్ గురువయ్యశెట్టి ఆదేశించారు. శనివారం స్థానిక టౌన్ మోడల్ కాలేజీలో పరీక్షల నిర్వహణపై సీఎస్, డీఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సదుపాయం కల్పించాలని, ప్రథమ చికిత్స చేసేందుకు అవసరమైన మెడికల్ టీఎంలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ పాషా, డీఈసీ సభ్యులు పాల్గొన్నారు.

వేళాంగిణి మాత దర్శనానికి 26న ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని వేళాంగిణి మాత దర్శనం కోసం ఈనెల 26వ తేదీన సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్‌హుసేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 8గంటలకు కర్నూలు కొత్తబస్టాండ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నానికి నాగపట్నం, రాత్రికి వేళాంగిణి చేరకుంటుందని పేర్కొన్నారు. 28న సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరి 29న ఉదయం 9గంటకు కర్నూలు చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో రానుపోను చార్జీ పెద్దలకు రూ.3వేలు, పిల్లలకు రూ.2వేలు ఉంటుందన్నారు. ముందస్తుగా టికెట్లు పొందేందుకు 73828 71131, 99592 25794 నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పీటీడీ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు జారీ

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జిల్లాల పునర్విభజన జరగడంతో కర్నూలు, నంద్యాల జిల్లాలు విడిపోయినా ఈసారికి రెండు జిల్లాల ఉద్యోగులు బదిలీల కోసం కర్నూలు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారికే దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనల మేరకు రిక్వెస్టు ప్రతిపాదికన దరఖాస్తు చేసుకునే వారు 2023 ఏప్రిల్ 30 నాటికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని ఉండాలి. రీజినల్ కేడర్ (కర్నూలు, నంద్యాల జిల్లాలు కలిపి) శ్రామిక్ నుంచి డ్రైవర్, కండక్టర్, డిపో క్లర్క్, లీడింగ్ హ్యాండ్ వరకు కర్నూలు ఆర్‌ఎంకు, జోనల్ కేడర్‌లోని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు, రాష్ట్ర స్థాయి కేడర్ ఉన్న సిబ్బంది విజయవాడలోని చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. గతంలో ఇచ్చిన దరఖాస్తులు చెల్లవని, కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌ఎం వెంకటరామం పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం



తీవ్ర గాయాలకు గురై మృతి చెందిన వెంకటేశ్వర్లు

పాణ్యం: కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై పాణ్యం సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొరియర్ వ్యాన్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నుంచి నంద్యాలకు వస్తున్న కొరియర్ వ్యాన్‌ను ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద వెనుక వస్తున్న కంటైనర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కొరియర్ వ్యాన్ బోల్తా పడడంతో నంద్యాల పట్టణానికి చెందిన డ్రైవర్ మేకల వెంకటేశ్వర్లు(54) తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య చౌడమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని తల్లీకుమార్తె మృతి

● మానసిక వికలాంగ కుమార్తెను రక్షించే యత్నంలో ప్రమాదం




మృతిచెందిన తల్లీ కుమార్తె నాగలక్ష్మి, లక్ష్మి (ఫైల్)

బొమ్మలసత్రం: మానసిక స్థితి సరిగాలేని కుమార్తె రైల్వేట్రాక్ దాడుతుండగా రైలు ఢీకొంటుందని తల్లి రక్షించబోయి ఇద్దరూ మృత్యువాత పడిన ఘటన శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ జలీల్‌ఖాన్ తెలిపిన వివరాలివీ.. స్థానిక ఎన్జీవోస్ కాలనీలో నివాసముంటున్న ఉప్పరి చంద్రామణి, నాగలక్ష్మి (50) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. పెద్దకుమారుడు ఆర్మీలో సైనికుడు. చిన్నకుమారుడు గుర్రప్ప పట్టణంలో చిన్న హోటల్ నడుపుతున్నాడు. పెద్దకుమార్తెకు వివాహం కాగా.. చిన్న కుమార్తె లక్ష్మి(30) మానసిక స్థితి సరిగా లేక ఇంట్లోనే ఉంటోంది. తండ్రి చంద్రామణి చిన్న హోటల్ నిర్వహిస్తున్నాడు. శనివారం వేకువజామున కూతురు లక్ష్మి ఇంటి నుంచి బయటకు వచ్చి పాన్నాపురం రైల్వే ట్రాక్‌పై నడుస్తూ వెళ్తోంది. ఇంట్లో కూతురు కనిపించకపోవడంతో లక్ష్మిని వెతుకుతూ రైల్వే ట్రాక్ వెంట నాగలక్ష్మి వెళ్లింది. కూతురు వెనుక రైలు వస్తుండటాన్ని గమనించిన నాగలక్ష్మి పరుగు తీసి ట్రాక్ నుంచి పక్కకు లాగేందుకు ప్రయత్నించింది. అయితే వేగంగా వస్తున్న రైలు ఇద్దరినీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీకూతుళ్లు అక్కడికక్కడే మరణించారు. స్థానికుల సమాచారంతో భర్త, సోదరుడు సంఘటనా స్థలానికి వెళ్లి బోరున విలపించారు. రైల్వే పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు. భర్త చంద్రామణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ మృత్యువాత

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన రఘు

మద్దికెర: కసాపురం ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన శనివారం మద్దమ్మకుంట వద్ద చోటుచేసుకుంది. ఆదోని పట్టణం కల్లుబావి ప్రాంతానికి చెందిన పాండు, శారదమ్మలకు ఇద్దరు కుమారులు. చిన్నవాడైన రఘు(25)కు మూన్నెల్ల క్రితం లతతో వివాహం జరిపించారు. మద్దికెరలో బంధువులతో మాట్లాడి.. బంధువు కమార్తె మానసను తీసుకొని కసాపురం ఆంజనేయస్వామి వారి దర్శనానికి నూతన దంపతులు బైకుపై వెళ్లారు. దర్శనానంతరం తిరిగి వస్తుండగా మద్దికెరలోని మద్దమ్మకుంట వద్ద రోడ్డుపై ఆటో, స్కూటర్ ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన వారిని గమనించి వాహనదారులు స్థానిక వైద్యశాలకు తరలిస్తుండగా రఘు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య లత, చిన్నారి మానసను 108లో గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. మద్దికెర ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

దిశ యాప్‌పై అవగాహన కల్పించండి

● మహిళా పోలీసులకు ఎస్పీ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: దిశ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులను ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళల రక్షణ కోసం ప్రతి సచివాలయ పరిధిలో ఒక మహిళా పోలీసును నియమించిందన్నారు. స్థానిక మహిళలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని అధికారుల సహాయంతో పరిష్కరించాలన్నారు. వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. సచివాలయ పరిధిలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచాలన్నారు. కేటాయించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటాద్రి, డీపీఓ ఏఓ సురేష్ బాబు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న మౌలానా అబ్దుల్ మాజిద్

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ కోసం పవిత్ర మక్కా, మదీనాకు వెళ్లే యాత్రికులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మౌలానా అబ్దుల్ మాజిద్ అన్నారు. శనివారం కర్నూలు జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో యాత్రకు వెళ్లే వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ కోసం సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కాతో పాటు మదీనా ప్రాంతాల్లో 40 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు సలీంబాషా, కార్యదర్శి సయ్యద్ అశ్ఫక్ హుసేన్, సలీమ్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు హఫీజ్ మంజూర్ అహ్మద్ పాల్గొన్నారు.